ఇన్‌స్టా ముసుగులో వలపువల

- ఎన్నారైని బ్లాక్‌మెయిల్ చేసి నిశ్చితార్థం
- భారీగా డబ్బు వసూలుకు ప్లాన్
- బాధితుడి ఫిర్యాదుతో యువతి అరెస్టు
- విశాఖపట్నంలో వెలుగుచూసిన ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయాలతో యువకులను ముగ్గులోకి దింపి వారి నుంచి డబ్బులు గుంజుతూ మోసాలకు పాల్పడుతున్న యువతిని ఏపీ పోలీసులు అరెస్టుచేశారు. భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని మురళీనగర్‌కు చెందిన కొరుప్రోలు జోయ్ జమీనా అమెరికాలో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐ మనోహర్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నది. వైజాగ్‌లో నివాసముంటున్న ఆ యువకుడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మనోహర్ స్నేహితురాలిని అంటూ పరిచయం చేసుకున్నది. కొన్ని రోజుల పాటు వారితో మంచిగా నటిస్తూ మీ అబ్బాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పగా వారు నిరాకరించారు. దీంతో ఆమె అమెరికా నుంచి యువకుడిని రప్పించి ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా మురళీనగర్ ఎన్జీవో కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లింది. మత్తు పానీయం ఇచ్చి ఇరువురు సన్నిహితంగా ఉంటున్నట్టు ఫొటోలు తీసింది. వాటితో తనను పెళ్లి చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేసింది. భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో రూ.5 లక్షలు ఖర్చు చేయించి తన స్నేహితుల సమక్షంలో బలవంతంగా నిశ్చితార్థం చేయించుకున్నది. అనంతరం పెళ్లి చేసుకోకపోతే అభ్యంతరకర ఫొటోలను బహిర్గతం చేస్తానని బెదిరిస్తూ వేధింపులకు గురిచేసింది. ఎన్నారై మనోహర్‌ను రోజుల తరబడి ఇంట్లో బంధించింది. ఎట్టకేలకు ఆమె నుంచి తప్పించుకున్న బాధితుడు.. ఈ నెల 4న భీమిలి పోలీస్‌స్టేషన్‌లో యువతిపై ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితురాలి నుంచి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇదే తరహాలో పలువురిని మోసగించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారించి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నోటీసు చూపిస్తున్న చంద్రనాయక్

To B2 chandra Naik s/o Valya naik age 39 lambada Y/o H no 7-15/1 yerugandla tanda bhadrayam

Whereas your attendance is necessary answer to Charge of U/s 143, 341, 136 Y/o 149 IPC you are hereby directed to appear in person or by pleader before the Third JFCM Court on the day 11th 2024 10-30 a.m. Dated this 03 day 09 20 24

Mahabubnagar

కోర్టు నుంచి వచ్చిన నోటీసు

తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు నోటీసులు

- సకలజనుల సమ్మెలో ఆర్టీసీ బస్సు ఆపినందుకు..
- అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు
- నవంబర్ 19న హాజరుకావాలని 28 మందికి సమన్లు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 6: ప్రత్యేక రాష్ట్రం కోసం 2011లో సకల జనుల సమ్మె సమయంలో అప్పటి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్టీసీ బస్సులను ఆపారు. అందుకు గానూ.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్ ఉద్యోగ సంఘం నాయకులపై అక్రమ కేసులను బనాయించింది. తాజాగా మళ్లీ పాత కేసులను బయటకు తీసి వారికి నోటీసులు పంపడం బాధాకరం. 28 మంది తెలంగాణ ఉద్యమకారులకు నోటీసులు పంపి.. నవంబర్ 19న కోర్టుకు హాజరు కావాలని పేర్కొన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యమాన్ని తమ భుజస్కంధాలపై మోస్తూ సబ్బండ వర్గాలను ఏకం చేసిన ఉద్యోగ సంఘం నాయకులకు తాజాగా నోటీసులు రావడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నోటీసులందుకున్న 28 మందిలో 15 మంది ఇప్పుడు ఉద్యోగ విరమణ పొందారు. వారి వయస్సు 70 ఏండ్ల పైబడింది. నలుగురు మహిళా ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా ఆ కేసును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యమ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కనుల పండువగా గంగానీళ్ల జాతర

సారంగాపూర్/దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : నిర్మల్ జిల్లా సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో గంగానీళ్ల జాతర అంగరంగా వైభవంగా ముగిసింది. ఆదివారం భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. పవిత్ర కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలో నిలబడి మొక్కులు తీర్చుకున్నారు. గంగానీళ్ల జాతరను పురస్కరించుకొని నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పోచమ్మ తల్లికి మొక్కలు చెల్లించుకున్నారు.

కూష్మాండ మాతగా ఏడుపాయల దుర్గమ్మ

మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గమ్మ కూశ్మాండ మాత అలంకరణతో దర్శనమిచ్చారు. – పాపన్నపేట

మహాలక్ష్మి అలంకరణలో..

మహబూబ్‌నగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.6,66,66,666తో అలంకరించారు. – పాలమూరు

లలితా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి కిక్కిరిసిపోయింది. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మలయప్పస్వామి ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

ఈబీసీలపై కాంగ్రెస్ వైఖరేంటి?: రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఈబీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరేమిటో స్పష్టం చేయాలని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఈబీసీల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వీ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈబీసీల జోలికొస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.

గోమాతకు పుట్టిన రోజు వేడుకలు

జగిత్యాలజిల్లా బీర్‌పూర్‌లో ఓ రైతు కుటుంబం లేగదూడకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించింది. బైరవేని సత్యనారాయణ– భాగ్యలక్ష్మి దంపతులు పెంచుకుంటున్న ఆవుకు పుట్టిన లేగదూడకు ఆదివారంతో సంవత్సరం నిండింది. ఈ క్రమంలో వేద పండితుడి ఆధ్వర్యంలో గోమాతకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేట్ కట్ చేసి.. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. – సారంగాపూర్

డొక్కు బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో డొక్కు బస్సుల స్థానంలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులను తెచ్చేందుకు సంస్థ ప్లాన్ చేస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి గత పదేండ్లలో ఏకంగా 6,680 డొక్కు బస్సులను ఆర్టీసీ తుక్కు కింద వేలం వేసి అమ్మేయగా, వాటిస్థానంలో 4,226 బస్సులను కొనుగోలు చేసింది. ప్రస్తుతం వెంటనే తుక్కుగా మార్చాల్సిన 1,213 డొక్కు బస్సుల స్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ఇటీవలే ఆర్టీసీ నివేదిక పంపింది. పీఎం ఈ డ్రైవ్ పథకంలో హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని సంస్థ ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్నది. నగరం అవసరాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం మరో 2,300 ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకునే చాన్స్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఒక్కో బస్సు ధర రూ.1.85 కోట్లు ఉండడంతో అద్దెకు తీసుకోవాలని యోచిస్తున్నది.

సింగూరు రెండు గేట్లు ఎత్తివేత

పుల్కల్, అక్టోబర్ 6: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆదివారం 6, 11వ నంబర్ గేట్లు 1.50 మీటర్ల మేర ఎత్తి 11,026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్తు ఉత్పత్తి కోసం జెన్‌కో 2,796 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆదివారం 13,076 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, 14,453 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగినట్టు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.708 టీఎంసీలు నీరు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

గుట్టపై రాతి కడీలు తీస్తే చర్యలు

ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తున్న పోలీసులు

ఊర్కొండ, అక్టోబర్ 6 : గుట్టపై రాతి కడీలు తీస్తే చర్యలు తీసుకుంటామని కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్సై వీరబాబు తెలిపారు. మండలంలోని ఊర్కొండపేట పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఉన్న హనుమాండ్ల గుట్టపై కడీలను విక్రయిస్తున్న వారి వద్ద నుంచి మూడు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకొని ఊర్కొండ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఉన్న గుట్టపై స్వామి వారి గుండం, మిషన్ భగీరథ ట్యాంకులు ఉన్నాయన్నారు. అయితే, ఇక్కడి రాతి కడీలకు డిమాండ్ ఉండడంతో నిత్యం బ్లాస్టింగ్‌లు చేపడుతున్నారన్నారు. ఆ శబ్దాలతో వాటర్ ట్యాంకులకు ప్రమాదం ఉందని గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని మూడు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. హనుమాండ్ల గుట్టపై అక్రమ మైనింగ్‌కు ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నైతిక విలువలతో ముందుకుసాగాలి

- రిటైర్డ్ డీఈవో విజయ్ కుమార్

రాజోళిలో మాట్లాడుతున్న విజయ్ కుమార్

రాజోళి, అక్టోబర్6: నైతిక, ఆధ్యాత్మిక విలువలతో విద్య, ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేస్తూ సామాజిక మార్పునకు నడుబింగించాలని రిటైర్డ్ డీఈవో విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గాంధీ గ్లోబల్ ఫామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ డీఈవో విజయ్ కుమార్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 100రోజులు,1000 కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా ఆదివారం రాజోళిలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా గాంధీచౌక్‌లో మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేనేత వస్త్రాధరణను ప్రోత్సహిస్తూ, మద్యం, మత్తు మందుల వాడకాలను నివారిస్తూ, స్వదేశీ వైద్యం, సేంద్రియ వ్యవసాయ అభివృద్ధితో యోగ, పౌష్టికాహారం సంపూర్ణ ఆరోగ్యం వైపు జీవితాలను అలవాటు చేసుకోనేందుకు అవగాహన కల్పించడానికే పాదాయత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ హన్మిరెడ్డి, ఎండీ అస్లాం షరీఫ్, నిషాక్, రిటైర్డ్ ఉపాధ్యాయులు రమేశ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌గా గోవర్ధన్

పాన్‌గల్,అక్టోబర్ 6: గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌గా జి. గోవర్ధన్ నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశం ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బి.లక్ష్మయ్య కొనసాగిన విషయం తెలిసిందే. కాగా కొంతకాలంగా గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పోస్టు ఖాళీగా ఉంది. ఈనేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన గ్రంథాలయ చైర్మన్ల నియామకంలో భాగంగా వనపర్తి జిల్లాకు గోవర్ధన్‌ను ఎంపిక చేశారు. ఈపదవీలో ఆయన రెండేళ్లపాటు కొనసాగనున్నారు. గోవర్ధన్‌కు పదవీ రావడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

మూసీ ప్రక్షాళనతో మోసం చేయొద్దు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

వనపర్తి, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : మూసీ నది ప్రక్షాళన పేరుతో పేదలకు నష్టం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అస్తవ్యస్తంగానే కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీపీఎం నాయకురాలిగా సేవలందించిన లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభ సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అధ్యక్షతన ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీరభద్రం హాజరవ్వగా ఎమ్మెల్యే మేఘారెడ్డి, మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన పేరుతో నిరుపేదలకు చెందిన 15వేల ఇండ్లు తొలగించాలని రేవంత్ రెడ్డి సర్కార్ చూస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణ అంటూ నిరుపేదలకు అన్యాయం చేస్తే అంగీకరించబోమన్నారు. మూసీ నదిని కాలుష్యం చేస్తున్న పెద్ద పెద్ద ఫార్మా కంపెనీలను ముట్టుకోవడానికి ప్రభుత్వానికి ధైర్యం లేక నిరుపేదల ఇండ్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆయన విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు, కాలుష్యనివారణకు తాము వ్యతిరేకం కాదని, ముందుగా పేదలకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే మూసీ ప్రక్షాళనకు ముందుకు రావాలన్నారు. ఇప్పటివరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అస్తవ్యస్తంగా నడుస్తున్నాయని, ఆర్టీసీలో ఉచిత ప్రయాణానికి బస్సులు సరిపోవడం లేదని గుర్తించినా అవసరమైన కొత్త బస్సులు రావడం లేదన్నారు. అలాగే రుణమాఫీని 40లక్షల మంది రైతులకు చేయాల్సి ఉండగా, కేవలం 22 లక్షల మందికి మాత్రమే చేశారన్నారు. ఇంకా 18లక్షల మంది రైతులు రుణమాఫీ రాక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మరో 3వేల ఎకరాల్లో 12 లక్షల చెట్లను నరికి అక్కడ ఓ పెద్ద పట్టణాన్ని నిర్మిస్తామని మరో కొత్త డ్రామాను తెరపైకి తీసుకొచ్చారని, ఇది కేవలం అక్కడి జీవరాసులు, చెంచులను ఇబ్బందులకు గురిచేయడం తప్పా మరొకటి కాదని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచి పెడుతున్నదని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగానికి రక్షణలాంటివి లేకుండా బీజేపీ పాలన సాగిస్తున్నదన్నారు. కమ్యూనిస్టులకు అసెంబ్లీ, పార్లమెంట్‌లో సీపీఎం ప్రజాప్రతినిధుల బలం లేదని, కమ్యూనిస్టులకు దేశంలో భవిష్యత్ ఉందా అంటూ కొందరు ఆలోచించడం సరికాదన్నారు. కమ్యూనిస్టుల ఎజెండా లేకుండా దేశ భవిష్యత్ లేదన్నట్లుగా ప్రతి ఒక్కరూ ముందడగు వేయాలని వీరభద్రం పిలుపునిచ్చారు. కాగా, కమ్యూనిస్టు ఎలా ఉండాలి అంటే...లక్ష్మీదేవమ్మలా ఉండాలనే విధంగా పనిచేయాలని, కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొని నిలబడ్డేవాళ్లే అసలైన కమ్యూనిస్టులని వీరభద్రం వెల్లడించారు.కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు అరుణ్ కుమార్, నాయకులు జాన్‌వెస్లీ, పర్వతాలు, భూపాల్, పుట్ట ఆంజనేయులు, బాల్‌రెడ్డి, మండ్ల రాజు, సీపీఐ నాయకులు విజయరాములు, కందాల రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్, అక్టోబర్ 6: మండలంలోని దవాజీపల్లి గ్రామానికి చెందిన తులస బుడ్డమ్మ(62) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ వెంకటేశ్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ కేతేపల్లి రవి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట మాజీ సర్పంచ్ వెంకటయ్య నాయుడు, ప్రేమ్‌సాగర్, యుగేంధర్ గౌడ్, వాల్మీకి నాయుడు, సుజీపన్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐకాన్ లెజెండ్ అవార్డు గ్రహీతకు సన్మానం

ధరూరు, అక్టోబర్ 6 : మున్నూరు కాపు కుల బంధువు, ఐకాన్ లెజెండ్ వార్డు గ్రహీత, రాయిచూరు మాజీ శాసనసభ్యుడు పాపిరెడ్డిని మార్లబీడు గ్రామ మాజీ సర్పంచ్ , బీఆర్ఎస్ నాయకుడు బంట్రోత్ శ్రీరాములు సన్మానించారు. ఆదివారం రాయిచూరు పట్టణంలో వీరాంజనేయ స్వామి కల్యాణ మండపంలో జరిగిన వేడుకలో పాల్గొని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బెల్లం శివారెడ్డి, నర్సింహులు, వెంకట్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

పాపిరెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధ్వజ స్తంభ ప్రతిష్ఠ పూజలు

గోపాల్‌పేట, అక్టోబర్ 6 : మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం దుట సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయ ఆవరణలో ప్రధానాచార్యులు బ్రహ్మశ్రీ రఘుప్రోలు జనార్దనస్వామి రాజయోగేశ్వరులు, బ్రహ్మశ్రీ నారాయణదాసు లవకుమారాచార్యులు, బ్రహ్మశ్రీ బాణాల రామాచార్యులు ఆధ్వర్యంలో పూజలు, మహామంగళహారతి సాయంత్రం కుంకుమార్చనలు, శిల్ప, హోమాలు, గ్రామోత్సవం నిర్వహించారు.

ఆలయ ఆవరణలో పూజలు చేస్తున్న భక్తులు

వడ్డె ఓబులన్నకు నివాళి

అయిజ, అక్టోబర్ 6: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబులన్న వర్ధంతి సందర్భంగా అఖిలపక్ష కమిటీ నాయకులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని జ్యోతిరావు పూలే కూడళ్లిలో వడ్డె ఓబులన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో వీరులు త్యాగాలు చేశారని, అణగారిన వర్గాల ఆశాజ్యోతి వడ్డె ఓబులన్న అని కొనియాడారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఆంజనేయులు, మద్దిలేటి, బీఆర్ఎస్వీ ఇల్లా నాయకులు పల్లయ్య, కృష్ణ, ఆంజనేయులు, నర్సింహులు, కొండ, తిమ్మప్ప, రాము పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలి

గట్టు, అక్టోబర్ 6 : వడ్డెరులు వడ్డె ఓబన్నను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని వడ్డెర సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వీరన్న, నర్సింహులు, ఆంజనేయులు, దొడ్డెన్న, బడేస్వామి, గోకారి, పెద్ద ఈరన్న, తోట రాముడు, బొంబాయి ఈరన్న పాల్గొన్నారు.

అయిజలో నివాళులర్పిస్తున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

గట్టులో నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

దుందుభీలో దెబ్బతిన్న సీసీరోడ్డు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు • పట్టించుకోని అధికారులు

సిర్సవాడ – మాదారం మధ్యలో దెబ్బతిన్న సీసీరోడ్డు

తాడూరు, అక్టోబర్ 6 : మండలంలోని సిర్సవాడ – మాదారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి దుందుభీ వాగులో సీసీరోడ్డు వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దుందుభీ వాగు నెల రోజులుగా ప్రవహిస్తుండడంతో వాగులో ఉన్న సీసీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా సిర్సవాడ గ్రామానికి చెందిన రైతులు రేయింబవళ్లు ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తుంటారు. వ్యవసాయ పొలాలకు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపైన వెళ్లాలంటే పూర్తి ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం ఈ రోడ్డు దెబ్బతినడం వలన వాహనదారులు, ప్రయాణికులు ఆకుతోటపల్లి, వేపూర్ నుంచి మేడిపూర్ గ్రామం మీదుగా 40 కిలో మీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేయడంతోపాటు శాశ్వత రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మైసమ్మ దేవతను దర్శించుకున్న భక్తులు

మైసమ్మ దేవతను దర్శించుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 6 : మండల పరిధిలోని నాయినోనిపల్లి మైసమ్మ దేవతను భక్తులు జిల్లా నలుమూలల నుంచి వచ్చి ఆదివారం దర్శించుకున్నారు. దసరా సెలవులు రావడంతో పిల్లా పాపలతో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆదివారం మైసమ్మకు ఆదాయం పెరిగినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

సౌభాగ్యలక్ష్మి అలంకరణలో మంచాలమ్మ

మంత్రాలయంలో సౌభాగ్యలక్ష్మి అలంకరణలో మంచాలమ్మ

మంత్రాలయం, అక్టోబర్ 6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాల యంలోని రాఘవేంద్రస్వామి మఠంలో కొలువుదీరిన గ్రామ దేవత మంచాలమ్మ దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సౌభాగ్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గ్రామ దేవత మంచాలమ్మను తుంగభద్ర నదీజలాలతో అభిషేకించి, గాజులు, బంగారు ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు మంచాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అశేష సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో శ్రీమఠం అధికారులు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.